క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



జ్యోతులతో నృత్యం చేస్తున్న భక్తులు

యాడికి: మండల కేంద్రంలో చౌడేశ్వరీ దేవి నవజ్యోతుల మహోత్సవాన్ని తొగటవీర క్షత్రియులు బుధవారం తెల్లవారుజామున భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సంతమార్కెట్ వద్ద జరిగిన మహోత్సవానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. వేకువ జాముననే చౌడేశ్వరీ దేవికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. విజన్ స్కూల్ సమీపంలో నుంచి దేవర ఇంటి వద్ద తయారు చేసుకున్న భక్తులు జ్యోతులను తలపై పెట్టుకొని చౌడేశ్వరీ దేవి స్తోత్రాలతో లయ బద్ధంగా నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. అనంతరం సంత మార్కెట్ వద్ద చౌడేశ్వరి ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు.

13న మండల సర్వసభ్య సమావేశం

శింగనమల: మండలపరిషత్ కార్యాలయంలో ఈనెల 13న ఎంపీపీ యోగేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నిర్మలాకుమారి తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉపాధి పనులు విరివిగా కల్పించండి



మాట్లాడుతున్న ఏపీఓ షబ్బీర్‌బాషా

యల్లనూరు: గ్రామాల్లో ఉపాధి హామీ పనులను విరివిగా కల్పించాలని ఏపీఓ షబ్బీర్ బాషా సిబ్బందికి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ అడిగిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద పండ్లమొక్కలు సాగుచేసిన రైతులు వాటిని సంరక్షించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే గ్రామాల్లో ఇంటి ఆవరణల్లో సోఫ్‌పిట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు ప్రతాప్, జయరాం, శంకర్, అదిల్, శ్రీనివాసులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రెండో ప్లాట్‌ఫారం ఏర్పాటు చేయాలని వినతి

గుంతకల్లు రూరల్: ఇమాంపురం రైల్వే స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారం ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తుల తరపున రాజన్న అనే వ్యక్తి బుధవారం డీఆర్‌ఎం విజయ్‌కుమార్‌కి వినతిపత్రం అందజేశాడు. తిరుపతి-గుంతకల్లు మధ్య నడిచే ప్యాసింజర్ రైలు తమ గ్రామం మీదుగా వెళ్తుందన్నారు. స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారం లేని కారణంగా రైలు ఎక్కి దిగే సమయంలో స్కూలు పిల్లలు, వృద్ధులు, మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రెండవ ప్లాట్‌ఫారంను ఏర్పాటు చేయాలని విన్నవించారు.

డ్వాక్రా మహిళల జీవనోపాధికి చర్యలు



మాట్లాడుతున్న వెలుగు డీపీఎం శివప్రసాద్

శింగనమల: డ్వాక్రా మహిళల జీవనోపాధికి చర్యలు తీసుకుంటున్నట్లు వెలుగు డీపీఎం శివ ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అనిమేటర్లు, మహిళా సంఘాల లీడర్లతో సెర్ప్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీపీఎం మాట్లాడుతూ సెర్ప్ అధికారులు ఎక్కడ వనరులున్నాయి, మహిళలు జీవనోపాధికి ఏమి చర్యలు తీసుకోవాలో నమోదు చేసుకుంటారన్నారు. మహిళలు జీవనోపాధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సెర్ప్ అధికారులు చంద్రశేఖర్ మహిళలతో పలు వనరులపై చర్చించారు. కార్యక్రమంలో సీసీ వెంకటేష్, అనిమేటర్లు , మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

పామిడి: రబీలో పంటలు సాగు చేసే రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని ఏఓ డీ లీనా వసుంధర పేర్కొన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వేరుశనగ పంటకు ఎకరాకు రూ.480, జొన్నపంటకు రూ.315, మొక్కజొన్నకు రూ.525, వరికి రూ.630, శనగపంటకు రూ.450 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. బ్యాంకులు, మీ సేవ, సీఎస్‌సీలో ప్రీమియం చెల్లించి రసీదు పొందాలని సూచించారు.వేరుశెగన, జొన్న, మొక్కజొన్న, శనగపంటకు ఈనెల 15లోపు, వరిపంటకు ఈనెల 31లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని ఏఓ వివరించారు.

ఈ నీటిని తాగలేం!

- గన్నెవారిపల్లి కాలనీలో దుర్వాసనతో తాగునీరు
- అవీ నాలుగు రోజులకోసారి సరఫరా
- పట్టించుకోని అధికారులు
- కాలనీవాసులకు తప్పని అవస్థలు



కాలనీలో కుళాయి నుంచి అరకొరగా వస్తున్న తాగునీరు



కాలనీకి నీటిని సరఫరా చేసే సంపు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి మునిసిపాలిటీలోని గన్నెవారిపల్లి కాలనీకి సరఫరా అవుతున్న తాగు నీరు దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆ నీటిని తాగలేక జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతోందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఆధికారులకు ఫిర్యాదు చేసినా మరమ్మతుల పేరుతో వచ్చి వెళుతున్నారే తప్ప సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. గన్నెవారిపల్లి కాలనీలో దాదాపు 15 వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. వీరందరికి నాలుగు రోజులకు పైగా ఒకసారి తాగునీరు వస్తోంది. రోజుల తరబడి తాగునీరు సరఫరా చేయకపోవడానికి ఆధికారులు వివిధ కారణాలతో కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ నీటిని ఉపయోగించడం వల్ల ఎక్కడ రోగాల బారిన పడుతామన్న భయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. గత్యంతరం లేక డబ్బు పెట్టి మినరల్ వాటర్‌ను క్యాన్‌ల ద్వారా తెచ్చుకుంటున్నామని, ఇతర అవసరాలకు తప్పని సరిగా దుర్వాసనతో కూడిన నీటిని తప్పని సరిగా ఉపయోగించుకోవాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు.

నీటి మోటార్లతోనే సమస్య?

కాలనీకి నాలుగు రోజులకోసారి కుళాయిలకు తాగు నీరు సరఫరా చేస్తారు. దీంతో కాలనీలో చాలా మంది మోటార్లను ఉపయోగించడం వల్ల మంచినీటిని సరఫరా చేసే పైపులు పగిలి అందులోకి మురుగు నీరు వెళ్లి ఆ నీరు కొళాయిలకు వచ్చేందుకు వీలుందని ఆధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో అనధికార కొళాయి కనెక్షన్లు అధికంగా ఉండటం మరో కారణమవుతోంది. కింది స్థాయికి కొంత సొమ్ము చెల్లిస్తే చాలు డిపాజిట్ లేకుండా అనధికారికంగా కనెక్షన్లు బిగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నీటి పన్ను చెల్లించవసరం లేకపోవడం ఎక్కువ మంది అక్రమ కనెక్షన్లు పొందేందుకు అసక్తి చూపుతున్నారు. వీటికి మోటర్లను బిగించి నీటిని తోడేస్తుండటంతో పైపులు పగిలి మురుగునీరు కలిసి దుర్వాసనతోకూడిన నీరు కొళాయిలకు సరఫరా అవుతోంది. అక్రమ కనెక్షన్లను అధికారులు అరికట్టలేకపోతున్నారు.

ఏడాది కాలంగా ఇదే పరిస్థితి



ఏడాది కాలంగా కుళాయిలకు నాలుగు రోజులకోసారి నీరు వస్తోంది. అరకొరగా కొళాయిలకు నీరు రావడంతో ఇబ్బందులు పడుతున్నాం. నీరు దుర్వాసన వస్తుండటంతో తాగలేని పరిస్థితి. ఆ దికారులు స్పందించి సక్రమంగా నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– నారాయణస్వామి, గన్నెవారిపల్లి కాలనీ

కుళాయిల్లో నీరు దుర్వాసన వస్తోంది



కుళాయిల్లో నీరు దుర్వాసన వస్తోంది. నీరు వచ్చినపుడు కొద్దిసేపు తప్పనిసరిగా దుర్వాసనతో కూడిన నీరు వస్తోంది. అనంతరం వచ్చిన నీరు కూడా సరిగా ఉండటం లేదు. ఈ నీటిని ఎలా ఉపయోగించుకోవాలో తెలియడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో పశువులు, ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నాం.

– జయమ్మ, గన్నెవారిపల్లి కాలనీ

చర్యలు తీసుకుంటాం



మంచినీటి పైపుల మరమ్మతులతో నీటి సరఫరాలో జాప్యమవుతోంది. కాలనీ జనాభాతో నీటి సరఫరా ఇబ్బందిగా ఉంది. అయినా కాలనీకి అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. సిబ్బందిని పంపి నీటి దుర్వాసనపై కారణాలను కనుక్కొంటాం. ఇకపై నీరు దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించాలి



విద్యుత్ డీఈఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గుత్తి: పెంచిన విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు గుత్తిలో బుధవారం ధర్నా నిర్వహించారు. ముందుగా పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్,మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ డీఈఈ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక మాట తప్పి విపరీతంగా పెంచారన్నారు. సర్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో ఇప్పటికే విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూలిగే నక్కపై తాడిపండు పడిందన్న చందంగా ఏకంగా విద్యుత్ చార్జీలను సుమారు రూ.వేల కోట్లు పెంచిందన్నారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించడంతో పాటు సర్ చార్జీలు, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఈ రాజశేఖర్‌కు అందజేశారు. జిల్లా నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీవీ రంగారెడ్డి, రంగస్వామి, కౌన్సిలర్లు వరదరాజులు, వాల్మీకి శివ,కేవీ రమణ, వెంకట సుబ్బయ్య, టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షుడు రాము, తోళ్లషాపు కాలనీ యువ నాయకులు హరి, పవన్, గద్దల నాగేంద్ర, గద్దల నాగరాజు, షఫి, సీనియర్ నాయకులు రాము, సుధాకర్, వెల్డింగ్ రవూఫ్, రమేష్‌రెడ్డి, జీపు రమణ, లక్ష్మి రెడ్డి, మల్లి,రాజన్న, రాము, జగదీష్ పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు మంచి చేస్తున్నామని చెబుతూ విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. సీపీఐ నియోజక వర్గం కార్యదర్శి టి.నారాయణస్వామి, మండల కార్యదర్శి మద్రిస్వామి, శ్రీనివాసరావు, తిరుపతయ్య, రామాంజినేయులు, నాగేంద్ర, ఆనంద్ వెంకట రాముడు, రాము తదితరులు పాల్గొన్నారు.

బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ పరిశీలన

తాడిపత్రి అర్బన్: ప్రాచీన ఆలయమైన బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం కేంద్ర పురావస్తు శాఖ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా కేంద్ర పురావస్తు అధికారులు బాలకృష్ణ, యోగేష్‌కు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో కల్యాణ మండపం శిథిలావస్థకు చేరుకుని కుప్పకూలిన విషయంపై గతంలో సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి రెండు నెలల క్రితం పురావస్తు శాఖాధికారులకు శిథిలమైన కల్యాణ మండపాన్ని పునరుద్ధరించాలని కేంద్ర పురావస్తు, దేవదాయశాఖ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా కేంద్ర పురావస్తు శాఖ బృందం కల్యాణమండపాన్ని పరిశీలించి పునరుద్ధరణ పనులను ప్రారంభించింది.

మనేరి కొండమ్మ దాతృత్వం



ఫ్రిజ్‌ను అందిస్తున్న మనేరి కొండమ్మ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని గాంధీ నగర్ కాలనీకు చెందిన వాల్మీకి సంఘం నేత మనేరి కొండమ్మ దంపతులు పీహెచ్‌సీకి రూ.25 వేల విలువైన ఫ్రిజ్‌ను అందజేశారు. ఆసుపత్రిలో మందులను నిల్వ ఉంచేందుకు ఫ్రిజ్ అవసరం ఉందని మండల డాక్టర్ స్వాతి లక్ష్మి కోరడంతో ఫ్రిజ్‌ను అందించారు. కొండమ్మను ఆసుపత్రి సిబ్బంది శాలువా పూలమాలలతో సన్మానించారు. ఎంపీపీ సునీత, డాక్టర్ స్వాతి లక్ష్మి, సీహెచ్‌ఓ మోహన్‌రావు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, పీహెచ్‌ఎన్ చెన్నమ్మ సత్య నారాయణ, నాగలక్ష్మి, శైలజ పాల్గొన్నారు.

7న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 7న స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులు తెలిపారు. తెల్లవారు జామున 4 గంటలకు స్వామికి రుద్రాభిషేకం, 9.30 గంటలకు శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పెద్దవడుగూరు : మిడుతూరు గ్రామం సమీపంలోని అమోఘ హోటల్ దగ్గర బుధవారం తెల్లవారు జామున ఆటోను బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన వివరాలు..అనంతపురానికి చెందిన వారు గుత్తి బాట సుంకులమ్మను దర్శించుకుని ఆటోలో తిరుగుపయనమయ్యారు. అమోఘ హోటల్ వద్దకు రాగానే గుత్తి నుంచి అనంతపురం వెళ్తున్న బొలెరో వాహనం ఆటోను ఢీకొంది. ఘటనలో ఆటోడ్రైవర్ శివకుమార్‌తోపాటు ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

యర్రగుంట్లలో 'పొలం పిలుస్తోంది'

గార్లదిన్నె: రబీలో పంటలు సాగు చేసిన రైతులు గడువులోగా ప్రీమియం చెల్లించాలని ఏడీఏ రవి పేర్కొన్నారు. బుధవారం యర్రగుంట్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పంటలు సాగు చేసే రైతులు కామన్ సర్వీస్ సెంటర్,మీ సేవ కేంద్రాల్లో బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే నష్టపరిహారం పొందవచ్చన్నారు. ఏఓ సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

పీఎస్ ప్రాజెక్టు భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్

యాడికి: మండలంలోని కుందనకోట, చింతలాయపల్లి గ్రామాల పరిధిలో దాదాపు 850 ఎకరాల్లో నిర్మించనున్న ఏపీ జెన్కో పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టు(పీఎస్‌పీ) భూములను బుధవారం గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కుందనకోట, చింతలాయపల్లి గ్రామాల్లో ప్రాజెక్టుకు కావాల్సిన కొండ భూములను పరిశీలించి ప్రాజెక్టుపై చర్చించామన్నారు. కార్యక్రమంలో జెన్కో డీఈ ఆంజనేయులు, తహసీల్దారు ప్రతాప్‌రెడ్డి, ఆర్ఐ కిష్టప్ప, వీఆర్వో భీమేష్‌రెడ్డి, నరసింహారావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజా

యల్లనూరు: మండలవ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 6 నుంచి జనవరి 04 వరకు జరిగే రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు రాజా సిబ్బందిని ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిరోజు మేడికుర్తి, 7న తిరుమలాపురం, 10న కోడుమూర్తి, 11న కాచర్లకుంట, 12న ఆరవేడు, 13న మల్లాగుండ్ల, 17న చింతకాయమంద, 18న నిట్టూరు, 19న వేములపల్లి, 20న పెద్దమల్లేపల్లి, 21న యల్లనూరు, 24న పాతపల్లి, 26న వెన్నపూసపల్లి, 27న చిలమకూరు, 28న బొప్పేపల్లి, 31న బుక్కాపురం, జనవరి 2న కల్లూరు, 3న గొడ్డుమర్రి, 4న శింగవరం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. భూములకు సంబంధించిన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మునీంద్ర, ఆర్ఐ నారాయణమ్మ, మండల సర్వేయరు షర్వానీ, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

'ఆరోపణలు రుజువు చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమే'



ఆధారాలు చూపుతున్న ఎంపీపీ మాధవి, మోహన్‌రావు

గుంతకల్లు రూరల్: మండలంలో ఎక్కడైనా పనులు జరగకుండా బిల్లులు చేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా తాము సిద్ధమేనని ఎంపీపీ బీవీ మాధవి, ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రావు పేర్కొన్నారు. ఎంపీపీ మాధవి, ఆమె భర్త మోహన్ గడచిన మూడేళ్లలో దాదాపు రూ.67 లక్షలను దారి మళ్లించినట్లు, పంచాయతీ ట్రాక్టర్‌ను సైతం ఇంటికి తీసుకెళ్లినట్లు బుధవారం ఒక పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. చేసిన పనులకు ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కాకపోయినప్పటికీ అప్పులు చేసి మరీ పనులు పూర్తి చేశామన్నారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో ఇప్పటివరకూ రూ.50 లక్షల మేర అభివృద్ధి పనులు చేపట్టామని, వీటి అధారాలు ఉన్నాయని, విచారణకు ఎవరు ఎప్పుడు పిలిచినా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రూ.50 లక్షల పనులు జరిగితే రూ.27 లక్షలు మాత్రమే మంజూరయ్యాయన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల మంజూరు కోసం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వద్దకు పలుమార్లు వెళ్లి కలిశామన్నారు. అంతకు మించి మరే ఇతర పనులు చేసిపెట్టమని ఎమ్మెల్యేను కోరింది లేదన్నారు. కానీ వరుసకు బంధువైన ఎమ్మెల్యేను అడ్డుపెట్టుకొని దందాలు నడుపుతున్నానని, ప్రభుత్వ అధికారుల బదిలీలు కాకుండా అడ్డుకుంటున్నానని తమపై అసత్యఆరోపణలు చేయడం తగదన్నారు. తమ బంధువుల ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకెళ్లి పనులు చేయించుకుంటుంటే, పాతకొత్తచెరువు గ్రామపంచాయతీకి మంజూరైన ట్రాక్టర్‌ను ఇంటికి తీసుకెళ్లి తమ సొంత పనులకు ఉపయోగించుకుంటున్నామని ఆరోపణలు చేయడం ఎంతవరకూ సబబు అని ప్రశ్నించారు. గతంలోనే తమపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేశారని, ఆ విషయంలో 4 నెలల క్రితం డీఎల్‌డీఓ, 4 ఎంపీడీఓల సమక్షంలో విచారణ జరిపి తమకు క్లీన్‌చిట్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. తమపై నిరాధార ఆరోపణలు చేయడం ఇప్పటికైనా మానుకోవాలని హితవుపలికారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గుంతకల్లు రూరల్: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాదులోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో తిమ్మాపురం జెడ్పీహైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గతనెల 15న జరిగిన పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని జ్యోత్స్న అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో ప్రత్యేక ప్రశంసా పత్రంతోపాటు, అవార్డును అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం నారాయణ రెడ్డి తెలిపారు. అలాగే పోటీల్లో ప్రతిభచాటిన మరో తొమ్మిది మంది విద్యార్థులకు కూడా ప్రశంసా పత్రాలను అందజేసినట్లు ఆయన తెలియజేశారు. ఈసందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

గార్లదిన్నె: కేశవాపురంలో బుధవారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. బాధిత రైతు రంగప్ప తెలిపిన వివరాలు..రంగప్ప తన గేదెలను గ్రామం సమీపంలోని వ్యవసాయ పొలాల్లో మేపు కోసం తోలుకెళ్లాడు. ఇందులో ఓ గేదె నేలపై పడిన విద్యుత్ తీగను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.రూ.70 వేలు నష్టం జరిగిందని, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుతో గ్రామాభివృద్ధి

పెద్దవడుగూరు : పరిశ్రమలు ఏర్పాటుతో గ్రామాలను అభివృద్ధి చేయవచ్చని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు పేర్కొన్నారు. బుధవారం కొండుపల్లిలో శ్రీరామ మైనింగ్ కంపెనీ నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు, ఎన్‌జీఓలు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఎంతో మంది కార్మికులు గనుల్లో పని చేస్తూ ప్రాణాలు కోల్పోయారని వారి కుటుంబాలను గనుల యజమానులు, ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు కోరారు. కొండుపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైందని, కొత్తరోడ్డు నిర్మించాలని విన్నవించారు. పర్యావరణ కాలుష్య నియంత్రణ అధికారి మునిప్రసాద్, తహసీల్దార్ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ పక్కాగా చేపట్టండి



బీమాపై అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్లు

గుంతకల్లు రూరల్: రబీ సీజన్‌లో ఈ- క్రాప్ నమోదు పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ రమాదేవి, ఏఓ స్వాతి సిబ్బందికి సూచించారు. బుధవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వాతావరణ బీమా సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ అరుణ్, జిల్లా కోఆర్డీనేటర్ దాసు, మండల కోఆర్డినేటర్ నవీన్ ఫసల్ బీమా, వాతావరణ బీమాపై సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్ రెవెన్యూ సదస్సులపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈనెల 6 నుంచి జరిగే రెవెన్యూ సదస్సులను జయప్రదం చేయాలని తహసీల్దార్ కోరారు.

పామిడిలో చిరుజల్లులు

పామిడి: మండలంలో తుపాన్ ప్రభావంతో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం కావడంతోపాటు చిరుజల్లులు కురిశాయి. చిరుజల్లులకు చలి తోడుకావడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లు బురదమయమవ్వడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు అవస్థలు పడ్డారు.

అంకితభావంతో పని చేయాలి



ఎంపీఈఓ జయలక్ష్మిని సన్మానిస్తున్న సిబ్బంది

శింగనమల: అంకితభావంతో పనిచేయాలని మండల వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. రాచేపల్లి రైతు సేవ కేంద్రంలో పని చేస్తున్న ఎంపీఈఓ జయలక్ష్మి నార్పల మండలం సిద్దరాచెర్లకు బదిలీ అయ్యారు. దీంతో బుధవారం శింగనమల వ్యవసాయ కార్యాలయంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఏఈఓలు అక్కమ్మ, ఏపీఓలు, ఏహెచ్‌ఓలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

పుట్లూరు: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలకేంద్రంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించడంతో పాటు బస్‌షెల్టర్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ జగన్నాథరెడ్డి, ఏఎన్‌ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్

గుత్తి రూరల్: సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరు తప్పక వేయాలని ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ సూచించారు. బుధవారం బసినేపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు రోజుకు రెండు బయోమెట్రిక్ ద్వారా హాజరు వేయాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ గ్రామంలో పర్యటించి ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొన్నారు.

కల్లు దుకాణాల తనిఖీ

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని పలు కల్లు దుకాణాలను బుధవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ గడ్డం నాయుడు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. నంద్యాల రోడ్డు, పాతకోట, నందలపాడులోని కల్లు దుకాణాలను పరిశీలించడంతోపాటు కల్లు నమూనాలను సేకరించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ కల్లును కల్తీ చేయడం చట్ట విరుద్ధమని, కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పెద్దవడుగూరు : కాశేపల్లి టోల్ గేట్ వద్ద బుధవారం అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఐ ఆంజనేయులు సీజ్ చేశారు. మండలంలో ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.